క్లుప్తంగా

రికార్డులు సరిగ్గా నిర్వహించాలి

కర్నూలు(హాస్పిటల్): ప్రైవేటు ఆసుపత్రుల్లో రికార్డులు సక్రమంగా నిర్వహించాలని జిల్లా సంచార చికిత్స నోడల్ అధికారి డాక్టర్ రఘు సూచించారు. శనివారం ఆయన నగరంలోని మెడికవర్ హాస్పిటల్‌ను అయన తనిఖీ చేశారు. రిజిస్ట్రేషన్, వైద్యుల సర్టిఫికెట్లు, ఫార్మసికి సంబంధించిన సర్టిఫికెట్లను పరిశీలించారు. ఎన్‌టీఆర్ వైద్యసేవ, వైద్యపరీక్షలు, మందుల విక్రయాలపై ఆరా తీశారు. ఆసుపత్రిలోని ల్యాబ్, స్కానింగ్ మిషన్లు, రోగులకు అందిస్తున్న సేవలు, రికార్డులు, పరిశుభ్రత, ఆసుపత్రికి వస్తున్న రోగుల సంఖ్య, జననాల రికార్డులు, హెచ్‌ఎంఐఎస్ పోర్టల్‌లోని నివేదికలు తదితర వివరాలు సేకరించారు. ఆయన వెంట గణాంకాధికారి హేమసుందరం, డెమో శ్రీనివాసులు శెట్టి, ప్రాజెక్టనిస్టు ఖలీల్ ఉన్నారు.

డీఈఓను కలిసిన ఫ్యాప్టో నూతన కార్యవర్గం

కర్నూలు సిటీ: జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.శ్యామూల్ పాల్‌ను శనివారం ఇటీవలే ఎన్నికైన ఫ్యాప్టో నూతన కార్యవర్గం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో జిల్లా చైర్మన్ సేవలాల్ నాయక్, తదితరులు వివిధ సమస్యలను డీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. డీఈఓను కలిసిన వారిలో ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ భాస్కర్, రవికుమార్, నవీన్ పాటిల్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు గోకారి, డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిమ్మప్ప తదితరులు ఉన్నారు.

వినతి.. నగరానికి దూరంగా ఉన్న పదవ తరగతి పరీక్షల మూల్యాంకనం కేంద్రానికి వెళ్లి వచ్చేందుకు ఆర్టీసీ బస్టాండ్ నుంచి బి.తాండ్రపాడు వరకు బస్సు ఏర్పాటు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్, నవీన్ పాటిలు డీఈఓకు వినతిపత్రం అందజేశారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న లీలా వెంకట శేషాద్రి

కర్నూలు(సెంట్రల్): క్షేత్ర స్థాయిలోపనిచేసే పారా లీగల్ వలంటీర్లు భారత శిక్షాస్మృతి, ఇతరచట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి, శాశ్వత లోక్‌అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్ సూచించారు. శనివారం న్యాయ సేవాసదన్‌లో పారా లీగల్ వలంటీర్లకు చట్టాలపై అవగాహన కోసం సదస్సును ఏర్పాటు చేశారు. క్షేత్రస్థాయిలో పారా లీగల్ వలంటీర్లు న్యాయసేవలు, న్యాయ సేవలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీసుల విజయలక్ష్మీ, శక్తి ఎస్‌ఓపీ యాప్, పిల్లలు సెల్‌ఫోన్ వాడకంతోకలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.

జిల్లా ప్రజలకు ఉగాది, రంజాన్ శుభాకాంక్షలు

కర్నూలు(సెంట్రల్): ఉగాది, రంజాన్ పండుగ సందర్భంగా పరిశ్రమల శాఖమంత్రి టీజీ భరత్, కలెక్టర్ పి.రంజిత్‌బాషా జిల్లా ప్రజలకు శనివారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం ఉగాది పండుగను హిందువులు తెలుగు సంవత్సరాదిగా జరుపుకోవాలని, సోమవారం పవిత్ర రంజాన్‌ను ముస్లింలు సంతోషంగా జరుపుకోవాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. కర్నూలు జిల్లా మతసామరస్యానికి పెట్టింది పేరని, ఎలాంటి ఘర్షణ వాతావరణం లేకుండా కుటుంబ సభ్యులతో పండుగలను జరుపుకోవాలని కోరుకుంటున్నట్లు వారు చెప్పారు.

కర్నూలు: తెలుగు నూతన సంవత్స రాది ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా ఎస్పీ విక్రాంత్ పాటిల్ జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఉగాది ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలని, అందరూ సుఖసంతోషాలతో జీవించాలని శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆకాంక్షించారు. రంజాన్ పండుగను ముస్లింలు సంతోషంగా జరుపుకోవాలని, అల్లాహ్ దీవెనలతో జిల్లా ప్రజలకు సకల శుభాలు కలగాలని ఎస్పీ పేర్కొన్నారు.

డాక్టర్ గోపిరెడ్డి కొండారెడ్డికి సన్మానం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని జనరల్ సర్జరీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ గోపిరెడ్డి కొండారెడ్డి శనివారం పదవీ విరమణ పొందారు. ఈ మేరకు ఆయనను ఏపీ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మాజీ మాస్టర్ మాట్లాడుతూ డాక్టర్ కొండారెడ్డి ఇదే కళాశాల పూర్వ విద్యార్థి అని, జనరల్ సర్జరీ విభాగంలో ఆయన అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు. విద్యార్థులకు సర్జరీ మెలకువలు బాగా నేర్పించేవారని, విద్యార్థులు ఆయన సేవలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి డాక్టర్ శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

చలువ పందిళ్లు ఏర్పాటు చేయండి

కర్నూలు (టౌన్): నగరంలో ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణా రెడ్డి తదితరులు శనివారం నగర కమిషనర్ రవీంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేశారు.

పండగ సందడి

ఓ వైపు ఉగాది.. మరో వైపు రంజాన్.. ఎటు చూసినా జనం బిజీబిజీగా ఉన్నారు. కర్నూలు నగరంలో శనివారం పండుగ సందడి నెలకొంది. కొండారెడ్డి బురుజు, పూల బజార్, సీ క్యాంప్, బళ్లారి చౌరస్తాతో పాటు పలు కూడళ్లలో జనం రద్దీ కనిపించింది. వస్త్ర, సరుకుల దుకాణాలు కిక్కిరిసి పోయాయి. ఉగాది పండుగ నేపథ్యంలో పూలు, మామిడాకులు కొనుగోలు చేస్తూ కనిపించారు.

– సాక్షి, ఫొటోగ్రాఫర్, కర్నూలు



కొనుగోలుదారులతో కిక్కిరిసిన పాత బస్టాండ్ పూల మార్కెట్

చిన్నారి చేతికి మెహిందీ

కిటకిటలాడుతున్న వస్త్ర దుకాణం



కొండారెడ్డి బురుజు వద్ద మామిడాకుల అమ్మకాలు



పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు

సాహిత్యం మెరిసి.. కళ మురిసి !

- ముగ్గురు జిల్లా వాసులకు రాష్ట్ర స్థాయి పురస్కారాలు
- నేడు విజయవాడలో సీఎం చేతుల మీదుగా పురస్కారాల స్వీకరణ



కథా రచయిత హరికిషన్



నవలా రచయిత అజీజ్



కళాకారుడు పత్తి ఓబులయ్య

కర్నూలు కల్చరల్: జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులు రాష్ట్ర ప్రభుత్వం ప్రదానం చేసే రాష్ట్ర స్థాయి పురస్కారాలకు ఎంపికయ్యారు. ఉగాది పర్వదినం రోజున సీఎం చంద్రబాబు వారికి పురస్కారాలను ప్రదానం చేయనున్నారు. కళా రంగంలో విశేష సేవలు అందిస్తున్న సుప్రసిద్ధ కళాకారులు నంది అవార్డు గ్రహీత, విశ్రాంత ప్రిన్సిపాల్ పత్తి ఓబులయ్యకు 'కళా రత్న', సాహిత్య రంగంలో విశేష సేవలు అందిస్తున్న కథా రచయిత డాక్టర్ ఎం.హరిషన్, నవలా రచయిత ఎస్‌డీవీ అజీజ్‌లకు 'ఉగాది' పురస్కారాలను ప్రకటించారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే ఉగాది వేడుకల్లో వీరు పురస్కారాలను స్వీకరించనున్నారు.

బాల సాహితీ వేత్త హరికిషన్‌కు ఉగాది పురస్కారం

జిల్లాకు చెందిన ప్రముఖ కథా రచయిత, బాల సాహితీ వేత్త, తెలుగు ఉపాధ్యాయులు డాక్టర్ ఎం. హరికిషన్ రాష్ట్ర స్థాయి ఉగాది పురస్కారానికి ఎంపికయ్యారు. పురస్కార జ్ఞాపికతో పాటు రూ.10 వేలు ప్రోత్సాహకాన్ని అందుకోనున్నారు. కర్నూలు పీజీ సెంటర్‌లో 'కేతు విశ్వనాథ రెడ్డి కథలు – సామాజిక దర్శనం' అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందారు. సామాజిక సమస్యల్ని పరిష్కరించడం కోసం సమాజంలో చైతన్యాన్ని పెంపొందించడం కోసం సాహిత్యాన్ని సాధనంగా మలచుకున్న ఇతను తన రచనల ద్వారా పాఠకులకు అవగాహన కలుగజేస్తున్నారు. 2011లో బాల సాహితీ రత్న, 2023లో అజో విభో కందాళం విశిష్ట బాల సాహితీ రచనా పురస్కారం, తెలుగు బంధువు పురస్కారాలను అందుకున్నారు.

నవలా రచయిత అజీజ్‌కు ఉగాది పురస్కారం

జిల్లాకు చెందిన ప్రముఖ నవలా రచయిత, పరిశోధకులు ఎస్‌డీవీ అజీజ్ రాష్ట్ర స్థాయి ఉగాది పురస్కారానికి ఎంపికయ్యారు. పురస్కార జ్ఞాపికతో పాటు రూ.10 వేలు ప్రోత్సాహకాన్ని అందుకోనున్నారు. 14వ ఏట రచనా వ్యాసంగాన్ని ప్రారంభించిన ఈయన సుమారు 45 సంవత్సరాల పాటు సాహిత్య రచనలు చేస్తూనే ఉన్నారు. పదుల సంఖ్యలో స్టేజీ నాటకాలు, రేడియో నాటకాలు, చారిత్రక నవలలు, పరిశోధన గ్రంథాలు, సాంఘిక నవలలు, కథల సంపుటాలు వెలువరించారు. పాలెగాడు, గులాం రసూల్ ఖాన్, తెర్నెకంటి ముట్టడి, బుడ్డా వెంగళ రెడ్డి, అజీజ్ కథలు, శ్రీకృష్ణ దేవ రాయలు పాలెగాడు, గులాం రసూల్ ఖాన్, శ్రీకృష్ణ దేవరాయలు లాంటి రచనలు ప్రముఖంగా ఉన్నాయి. 2022లో తెలుగు కళా సమితి పురస్కారం, 2023లో డాక్టర్ ఇస్మాయిల్ ఎక్సలెన్సీ అవార్డు, నక్కలమిట్ట ఫౌండేషన్ వారి జీవిత సాఫల్య పురస్కారం, తుర్రేబాజ్‌ఖాన్ నాటకానికి తెలుగు యూనివర్సిటీ ఉత్తమ గ్రంథం పురస్కారం అందుకున్నారు.

పత్తి ఓబులయ్యకు 'కళారత్న'

కర్నూలు నగరానికి చెందిన టీజీవీ కళా క్షేత్రం అధ్యక్షుడు, నంది వార్డు గ్రహీత విశ్రాంత ప్రిన్సిపాల్ పత్తి ఓబులయ్య కళారత్న (హంస) పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ పురస్కారం కింద కళారత్న బిరుదుతో పాటు, హంస విగ్రహంతో సత్కరించడంతో పాటు రూ.50 వేలు నగదు ప్రోత్సాహకం అందజేస్తారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేసే ఉగాది హంస పురస్కారానికి ఎంపికైన ఓబులయ్య గత 50 సంవత్సరాలకు పైగా నాటక రంగానికి వివిధ రూపాల్లో విశేష సేవలు అందిస్తూ వస్తున్నారు. జిల్లాలో తొలి హంస పురస్కారానికి ఎంపికైన తొలి కళాకారుడిగా నిలిచారు. కొన్నేళ్లుగా కర్నూలు నగరంలో లలిత కళాసమితి, టీజీవీ కళాక్షేత్రాలకు ఎంతో సమర్థవంతంగా అధ్యక్ష పదవిని నిర్వహిస్తున్నారు. 'పులిస్వారి' సాంఘిక నాటకంలో నటించడమే కాక దర్శకత్వం వహించి ప్రశంసలు అందుకున్నారు. సుమారు 150 సార్లు వివిధ నాటకాలకు దర్శకత్వం వహించి ప్రేక్షకుల హృదయాలలో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు.

ఆల్‌మేవా సహకారం అభినందనీయం



కిట్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ పీ రంజిత్‌బాషా

కర్నూలు(అర్బన్): రంజాన్ మాసంలో ఆల్‌మేవాలోని పలు ప్రభుత్వ శాఖల్లోని మైనారిటీ ఉద్యోగులు పేదలకు సహాయం చేయడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ పీ రంజిత్‌బాషా అన్నారు. శనివారం ఆల్‌మేవా ఆధ్వర్యంలో రూ.2 లక్షల విలువ చేసే 200 రంజాన్ ఈద్ కిట్లను ఆయన నగరంలోని పేద ముస్లింలకు పంపిణీ చేశారు. ఆల్‌మేవా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ మహమ్మద్ రియాజ్ భాష, ఏ మౌలిబాషా, ఫైనాన్స్ సెక్రెటరీ ఎస్ షఫీ అహమ్మద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు పేద వారికి సహాయం చేయడం శుభ పరిణామమన్నారు. ఆల్‌మేవా నేతలు మాట్లాడుతూ మైనారిటీ ఉద్యోగుల ద్వారా క్లౌడ్ ఫండింగ్ రూపంలో సమకూరిన రూ.2 లక్షలతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.

అదుపు తప్పిన కారు

కర్నూలు: నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయం సమీపంలో ఓ ఎలక్ట్రికల్ కారు అదుపు తప్పి వాహనాలపైకి దూసుకెళ్లింది. స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఉమామహేశ్వరరెడ్డి శనివారం సాయంత్రం విధులు ముగించుకుని పెద్దాసుపత్రి వైపు నుంచి ఇంటికి బయలుదేరారు. విశ్వేశ్వరయ్య సర్కిల్ వద్ద రోడ్డు దాటుతున్న ఓ మహిళను తప్పించబోయి ముందు వెళ్తున్న రెండు ఆటోలు, రెండు బైకులను ఢీకొట్టి పక్కనే ఉన్న దుకాణంలోకి వెళ్లింది. ఈ ప్రమాదంలో మహిళ, బాలుడు, ఇద్దరు యువకులకు స్వల్ప గాయాలయ్యాయి. ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్ ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం తీరును పరిశీలించారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. సకాలంలో బ్రేక్ అదుపు కాకపోవడంతో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

టీడీపీ నేతలు దాడులకు తెగబడుతున్నారు



విలేకరులతో మాట్లాడుతున్న లింగాపురం సర్పంచు నాగార్జున రెడ్డి

కర్నూలు (టౌన్): తమ పార్టీ అధికారంలో ఉందని టీడీపీ నేతలు దాడులకు తెగబడుతున్నారని జూపాడుబంగ్లా మండలం లింగాపురం గ్రామ సర్పంచ్ నాగర్జునరెడ్డి విమర్శించారు. నాలుగు రోజుల క్రితం టీడీపీ వర్గీయుల దాడిలో గాయపడి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన శనివారం జూపాడుబంగ్లా జెడ్పీటీసీ జగదీశ్వర రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. లింగాపురం గ్రామ పరిధిలోని భూమి విషయంలో వివాదం ఉందన్నారు. ఈనెల 25వ తేదీన పొలం వద్ద సర్వే చేయిస్తున్న తనతో పాటు తన తండ్రి రాజ్‌కుమార్ రెడ్డిపై జూపాడుబంగ్లాకు చెందిన టీడీపీ నేత జంగాల పెద్దన్న అతని కుటుంబసభ్యులు కర్రెలతో దాడికి పాల్పడ్డారన్నారు. వైఎస్సార్‌సీపీ మద్దతుదారులమనే కారణంతోనే కక్షకట్టి టీడీపీ నాయకులు దాడులు చేసి, కేసులు పెడుతున్నారన్నారు. భూ వివాదాన్ని చట్టబద్ధంగా ఎదుర్కొంటామన్నారు. టీడీపీ నాయకుల ఆక్రమణలు, అరాచకాలకు అధికారులు అడ్డుకట్ట వేయాలన్నారు.

యమపాశం విసురుతా!



యమధర్మరాజు వేషధారునితో రహదారి భద్రత నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

యముండా... నిబంధనలు పాటించకపోతే మింగేస్తా... యమపాశం విసురుతా...! ద్విచక్ర వాహనదారులూ... హెల్మెట్ ధరించండి... నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్టు ధరించండి... అతి వేగం ప్రమాదకరం... అంటూ రహదారి భద్రత నిబంధనలు, హెల్మెట్ వినియోగంపై కర్నూలు ట్రాఫిక్ పోలీసులు యమ ధర్మరాజు వేషధారణతో శనివారం నగరంలోని పలు ముఖ్య కూడళ్లలో విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కర్నూలుకు చెందిన కళాకారుడు ఫయాజ్ చేత యమధర్మరాజు వేషం వేయించి ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్ ఆధ్వర్యంలో కర్నూలులోని రాజ్‌విహార్, వై-జంక్షన్‌తో పాటు పలు ముఖ్య కూడళ్లలో యమ ధర్మరాజు వేషధారుని చేత అవగాహన కల్పించడం వాహనదారులను ఆకట్టుకుంది. మీరు ప్రేమించేవారి భద్రత మీకు ముఖ్యమైనది కాదా, హెల్మెట్ ధరించండి... ప్రాణాలను కాపాడుకోండి... వేగం కన్నా ప్రాణం మిన్న... అంటూ ముద్రించిన ప్లకార్డులు, బ్యానర్లను ట్రాఫిక్ పోలీసులు చేతపట్టుకుని వాహనదారులకు అవగాహన కల్పించారు. – కర్నూలు

భవిష్యత్తు మనదే

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి



ఎస్వీ మోహన్‌రెడ్డి దంపతులను సత్కరిస్తున్న పార్టీ నేతలు

కర్నూలు (టౌన్): 'ప్రజల పక్షాన పోరాడుదాం.. వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేద్దాం.. భవిష్యత్తు మనదే' అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక గిప్సన్ కాలనీలోని తన స్వగృహంలో రాష్ట్ర స్థాయిలో పదవులు దక్కిన ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రైల్వే ప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్‌పర్సన్ విజయ మనోహరిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్వీ మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసే వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. పదవులు దక్కిన వారు పార్టీ అభివృద్ధికి పాటు పడాలన్నారు. ఏడాదికే కూటమి సర్కార్‌పై అన్ని వర్గాల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన కలెక్టరేట్ నుంచి తాగునీటి సమస్య, ఎండల తీవ్రతల నేపథ్యంలో సహాయక చర్యలపై అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోనెగండ్లలో తీవ్రనీటి సమస్య ఉందని సబ్ కలెక్టర్ కలెక్టర్ దృష్టికి తేగా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారిని ఆదేశించారు. అదే విధంగా ఆదోని మునిసిపల్ కమిషనర్, మంత్రాలయం ప్రత్యేకాధికారి, ఆలూరు ఎంపీడీఓను మంచినీటి సమస్యపై కలెక్టర్ ఆరా తీశారు. జేసీ డాక్టర్ బి.నవ్య మాట్లాడుతూ..రీసర్వేకు సంబంధించి పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన 18 గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తయిందని, మిగిలిన ఆరు గ్రామాల్లో త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించింది.

ప్రతి గ్రామంలో చలివేంద్రాలు,మజ్జిగ పంపిణీ

రోజురోజుకు ఎండ వేడిమి పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు ఇబ్బంది పడకుండా ఆయాశాఖల పరంగా ఉపశమన చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో చలివేంద్రాలు, చలువ పందిళ్లు, మజ్జిగ పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ, డీపీఓ, ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లను ఆదేశించారు.

సారా పాత నేరస్తులపై బైండోవర్ కేసులు

కర్నూలు: నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా కల్లూరు మండలం కొల్లంపల్లితాండ గ్రామానికి చెందిన నాటుసారా తయారీదారులు 26 మంది పాత నేరస్తులపై ఎక్సైజ్ అధికారులు బైండోవర్ కేసులు నమోదు చేసి కల్లూరు ఇన్‌చార్జి తహసీల్దార్ శివరాం ఎదుట హాజరుపరిచారు. ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డితో కలసి తహసీల్దార్ వారికి కౌన్సిలింగ్ ఇచ్చి గ్రామ కమిటీ తీర్మానం మేరకు వారిని బైండోవర్ చేస్తూ కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో కర్నూలు ఎక్సైజ్ సీఐ చంద్రహాస్, ఎస్ఐ దుర్గా నవీన్ బాబు, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ మధు పాల్గొన్నారు.

మహనీయుల జయంతి నిర్వహణపై నిర్లక్ష్యమా?

కర్నూలు(సెంట్రల్): ఏప్రిల్ 5వ తేదీన బాబు జగ్జీవన్‌రామ్, ఏప్రిల్ 14న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతుల నిర్వహణపై అధికారుల నిర్లక్ష్యాన్ని దళిత, ప్రజా సంఘాలు ఖండించాయి. మహానుభావుల జయంతుల నిర్వహణ కోసం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో దళిత, ప్రజా సంఘాలతో ముందస్తు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి కలెక్టర్, జేసీ, డీఆర్వోలలో ఒక్కరైనా హాజరై ఆయా జయంతులను ఎలా నిర్వహించాలన్న దానిపై సలహాలు, సూచనలు స్వీకరిస్తారు. అందులో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశానికి అధికారులెవరూ రాకపోవడంతో ఆయా సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే బయటకు వచ్చి కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు అనంతరత్నం, కైలాష్ నాయక్, మాల వెంకటేశ్ మాట్లాడుతూ..తమను సమావేశానికి రావాలని పిలిచి అధికారులు ఎందుకు రాలేదని ప్రశ్నించారు.కార్యక్రమంలో దళిత, గిరిజన సంఘాల నాయకులు రాజీవ్‌కుమార్, ఎరుకలరాజు, గద్ద రాజశేఖర్, సోమసుందరం మాదిగ, ప్రభుదాసు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో ఫిర్యాదుల పరిష్కార ప్రొఫార్మాలు

కర్నూలు(హాస్పిటల్): స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు సంబంధించి ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసే ప్రక్రియలో అభ్యర్థుల ఫిర్యాదుల పరిష్కార పూర్తి ప్రొఫార్మాలను కర్నూలు వెబ్‌సైట్ https:// kurnool. ap. gov. in, https:// kurnoolmedicalcollege. ac. in లో ఉంచినట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 జనవరి 29న ఇచ్చిన నోటిఫికేషన్‌లో మొత్తం 13 కేడర్లలో అత్యవసర సేవలకు సంబంధించి (మెడికల్ ఫిజిసిస్ట్, ఓటీ అసిస్టెంట్, అనెస్తీషియా టెక్నీషియన్, జనరల్ డ్యూటీ అటెండర్) అభ్యర్థుల ఫిర్యాదుల పరిష్కార ప్రొఫార్మాలను వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. ఫిర్యాదులు పెట్టుకున్న అభ్యర్థులు వెబ్‌సైట్‌లో చూసుకోవాలన్నారు.